నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని బోయిన్పల్లి ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భూదేవినగర్ సబ్ స్టేషన్ రామరాజు నగర్ ఫీడర్ పరిధిలో రామరాజు నగర్, ఎండీఎఫ్ రోడ్డు, శంకర్ ఎన్క్లేవ్, సమతానగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరుమలగిరి సబ్ స్టేషన్ కానాజిగూడ ఫీడర్ పరిధిలో తిరుమలనగర్, గ్రీన్ ఫీల్డ్స్ కాలనీ, ఖానాజీగూడ, సాయిసాగర్ రెసిడెన్సీ, సాయినగర్ కాలనీ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు భూదేవినగర్, తిరుమలగిరి సబ్ స్టేషన్ల పరిధిలో రామరాజు నగర్ ఫీడర్లలో రామ్‌రాజ్ నగర్, ఎండీఎఫ్ రోడ్డు, సాయి సాగర్ రెసిడెన్సీ, సాయినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పద్మజారెడ్డికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పద్మజారెడ్డి

జీడిమెట్ల: సేవలను గుర్తించి మనం ఫౌండేషన్ వారు గౌరవ డాక్టరేటును ఇవ్వడం పట్ల పద్మజారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. సుభాష్‌నగర్‌కు చెందిన పద్మజారెడ్డి కొన్నేళ్లుగా స్థానికంగా సరస్వతి ఫౌండేషన్‌ను స్థాపించి అనాథ పిల్లలను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. ఇది గుర్తించిన మనం ఫౌండేషన్ సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ హాల్‌లో డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా డాక్టరేట్‌ను ఆమె అందుకున్నారు.

ఆలయంలో అన్నదానం



కట్ట మైసమ్మ అమ్మవారు

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం రూపారాణి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 500 మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని అన్నదానంలో పాల్గొన్నారు.

కన్‌స్ట్రక్షన్‌కు ప్రభుత్వ భూమి కేటాయించొద్దు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజలు

నిజాంపేట్ : ఆకృతి కన్‌స్ట్రక్షన్‌కు ప్రభుత్వ భూమి అధికారికంగా కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు బిల్డర్లకు మద్దతుగా నిలుస్తున్నారని మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, ఆకుల సతీష్ అన్నారు. మంగళవారం బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కన్‌స్ట్రక్షన్ భవన నిర్మాణానికి అప్రోచ్ రోడ్డుగా ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 454 చూపిస్తూ అనుమతులు పొందడంపై 2 సంవత్సరాలుగా ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులకి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్‌రావు, ముఖేష్, సుధాకర్‌రెడ్డి, కవితారెడ్డి, పాండు, ఎల్లస్వామి, ముఖేష్, శ్యామ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండరాజు కాలనీలోని శ్మశాన వాటికను పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మహిళలు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు. శానిటేషన్ అధికారులను పిలిచి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అదే కాలనీలో గ్లాండ్ ఫార్మా కంపెనీ నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, నాయకులు అంబటి సునీల్ కుమార్, శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైట్ హాల్ట్.. నరకమే!

జగద్గిరిగుట్ట బస్టాండ్‌కి నిత్యం 45 సిటీ బస్ సర్వీసులు, 13 జిల్లాల నుంచి వివిధ డిపోలకు చెందిన బస్సులు వస్తుంటాయి. ఇదే చోట వ్యాపార సముదాయాలు, పూల వ్యాపారులు, లేబర్ అడ్డాలు. ఇవన్నీ కేవలం 1000 గజాల జగద్గిరిగుట్ట బస్టాండ్‌లోనే. జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ సిబ్బంది నైట్ హాల్ట్ అంటేనే జంకుతున్నారు. స్థలం లేక వేంకటేశ్వరస్వామి కొండపై బస్సు పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో వారు పడే బాధలు అంతా ఇంతా కావు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు.

సౌకర్యాలు లేక ఆర్టీసీ సిబ్బంది సతమతం

- 13 జిల్లాల నుంచి బస్సులు రాక
- కనీసం మరుగుదొడ్లు కూడా లేని వైనం
- జిల్లాల బస్సులకు ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్



కొండపై పలు డిపోలకు చెందిన బస్సులను నిలిపిన దృశ్యం

జగద్గిరిగుట్ట: ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా జీడిమెట్ల, బాలానగర్, గాంధీనగర్ ప్రాంతాలు పేరొందాయి. పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో వివిధ జిల్లాల నుంచి ప్రజలు పనుల కోసం వలసలు వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. జనగాం, తొర్రూర్, హుస్నాబాద్, సూర్యాపేట, వనపర్తి, హన్మకొండ, మహబూబాబాద్, నర్సంపేట, యాదగిరిగుట్ట తదితర డిపోలకు చెందిన బస్సులు వస్తుంటాయి.

సిబ్బందికి వసతులేవి?

జిల్లాల నుంచి వచ్చే సుమారు 40 పైగా నైట్ హాల్ట్ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. బస్టాండ్‌లో స్థలం సరిపోకపోవడంతో రాత్రి జగద్గిరిగుట్ట కొండపై ఉన్న ఖాళీ స్థలంలో బస్సులు నిలుపుతున్నారు. ఇక అక్కడ తాగటానికి నీరు కూడా లేదు. ఆదాయం పైన దృష్టి సారించే ఆర్టీసీ.. సిబ్బందికి వసతులు కల్పించడంలో విఫలమైందని ఆయా కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తినడానికి కూడా సరైన స్థలం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందికి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, తినడానికి స్థలం తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాత్రంతా జాగారమే..

నైట్ హాల్ట్‌కు వచ్చే డ్రైవర్లు, కండక్టర్ల బాధలు వర్ణించలేనివి. దోమలతో కంటి మీద కునుకు లేకుండా ఎప్పుడు తెల్లారుతుందో అని ఎదురు



వసతి లేక బస్సులోనే భోజనం చేస్తున్న సిబ్బంది

చూడాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు కండక్టర్ల వద్ద డబ్బులు దగ్గర ఉండటంతో భయం భయంగానే ఉంటున్నారు. గతంలో కొండపై కండక్టర్‌ను కొట్టి అతని వద్ద నుంచి డబ్బులు దోచుకెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయి. బస్సు లోపల పడుకున్నా వారిని డోర్ తీయాలని, లేకుంటే అద్దాలు పగలగొడతామని బెదిరిస్తూ తాగుబోతులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి జాగారం చేస్తున్నాం



డబ్బులను కాపాడుకోవడం, దోమలతో పోరాడుతూ తినడం షరమామూలైంది. రాత్రి వేళల్లో కొండపైన బస్సుల చుట్టూ తాగి భయాభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో రాత్రంతా నిద్ర లేకుండా జాగారం చేయాల్సి వస్తుంది.

– వీరస్వామి, డ్రైవర్, తొర్రూర్ డిపో

నైట్ హాల్ట్ అంటేనే భయం



జగద్గిరిగుట్టలో నైట్ హాల్ట్ అంటేనే భయం వేస్తుంది. వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. కొండపై అన్ని దేవాలయాలు ఉండటం వల్ల మల విసర్జనకు కూడా కష్టవుతుంది. కనీస సౌకర్యాలు కూడా లేవు.

– వెంకటేశ్వర్లు, కండక్టర్, జనగాం డిపో

వినతులు.. హామీలతోనే సరి!

ప్రతీ ఎలక్షన్‌లలో సెంటిమెంట్ కోసం ప్రచారం ఇక్కడి నుండే మొదలు పెట్టే నేతలు బస్టాండ్ అమలు విషయమై హామీలు ఇవ్వడం తప్ప ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో బస్టాండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ అప్పటి మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఇక వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రులకు అనేక దఫాలుగా వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు చొరవ చూపి కనీస వసతులతో బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

2న మెగా జాబ్ మేళా

చింతల్: ఆదిత్య అండ్ మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కోడి ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించిన యువత కోసం సుమారు 15 పైగా కంపెనీల ద్వారా సుమారు 2000 పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, జెన్ ప్యాక్ తదితర బహుళ కార్పొరేట్ సంస్థల ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. మెగా జాబ్ మేళా చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తిగల యువత సద్వినియోగం చూసుకోవాలన్నారు. 8309447458, 9652098401 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేత

కుత్బుల్లాపూర్: గాజులరామారం, షాపూర్ నగర్‌లో 31న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆహ్వానించారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని శ్రీశైలంగౌడ్ అన్నారు. కార్యక్రమంలో గాజులరామారం, షాపూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు పవన్ కుమార్ గుప్తా, వాస శ్రీనివాస్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ గుప్తా, శంకర్ గుప్తా, ప్రభాకర్ గుప్తా, జగదీష్, మూర్తి, సంతోష్, శేఖర్, ఉప్పలయ్య, హర్ష, ప్రియాంక, కవిత, గీత, మమత తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే వివేకానంద్



అల్లం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లోని అల్లం చెరువులో మురుగునీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం అల్లం చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులను సుందరీకరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.40 లక్షల నిధులతో అల్లం చెరువును అభివృద్ధి పరిచామన్నారు. ప్రజలకు ఆహ్లాదమైన వాతావరణంతో పాటు వాకర్లు నడిచేందుకు నడక మార్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ లక్ష్మీగణేష్, డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, జలమండలి డీజీఎం రాజేష్, మేనేజర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్ యాదవ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



అవార్డు అందుకుంటున్న శివకుమార్ యాదవ్

సుభాష్‌నగర్: మేము సైతం మీ కోసం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కట్టేబోయిన శివకుమార్‌యాదవ్‌కు అరుదైన గౌరవం దక్కింది. సుభాష్ నగర్ డివిజన్ సూరారం రాజీవ్ గృహకల్పలో నివాసముండే శివకుమార్‌యాదవ్‌కు నగరంలోని త్యాగరాయ గానసభలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బైబిల్ యూనివర్సిటీ(సౌతాఫ్రికా) డాక్టరేట్, నేషనల్ అవార్డును అతిథులు ప్రదానం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న సేవలు గుర్తించి తనకు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. తన వంతు సేవ చేస్తానన్నారు. డాక్టర్ చక్రవర్తి, మాజీ సైనిక ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీ వేంకటేశ్వర స్వామి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 54వ బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. రంగులు, విద్యుత్ అలంకరణ, పారిశుద్ధ్య పనులతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. పూజలలో భాగంగా 2న పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వేదాపారాయణం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం, 3న ఉదయం అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం, 4న స్వామివారి పల్లకీ సేవ, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నిజాంపేట్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా నిరుపేదలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెరికె శివ, తైలం శ్రీనివాస్, ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి, శామీర్‌పేట్ ప్రకాష్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, గొంగుల నవీన్, ఆదిరెడ్డి, లక్ష్మీరెడ్డి, మాధవిరాణి, నీలగుప్తా, చిన్నమ్మ, జానకి, ధనలక్ష్మి, కోమల పాల్గొన్నారు.

పరామర్శ

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

అధ్యక్షుడు మద్దికుంట నవీన్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి మంగళవారం గాగిల్లాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, బొంగునూరి కిశోర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలో నూతన వేతన ఒప్పందం



నాగరాజును అభినందిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల సాధనకు యాజమాన్యాలతో ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధమని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో థర్మోకేబుల్ కంపెనీలో మంగళవారం నూతన వేతన ఒప్పందం జరిగింది. మూడు సంవత్సరాల గాను కార్మికులకు రూ.10 వేల వేతనం పెంపుదల, అదే విధంగా ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని యాజమాన్యం అంగీకరించిందని ఆయన తెలిపారు. కార్మికుల కుటుంబానికి సంవత్సరానికి రూ.2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, దసరాకు నెల జీతం బోనస్, సంవత్సరానికి రెండు జతల బూట్లు, రెండు జతల దుస్తులు, అలాగే షిఫ్ట్ అలవెన్స్, వీడియో పాయింట్ వంటి అంశాలపై స్పష్టమైన అంగీకారం కుదుర్చుకున్నామన్నారు. ఈ అగ్రిమెంట్ థర్మో కేబుల్ యూనిట్‌లో అన్నిటికన్నా టాప్ అగ్రిమెంట్ అని, కార్మికుల సమస్యలపై స్పందించిన యాజమాన్యానికి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. వేతన ఒప్పందంలో కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు భజన్ ఖాన్, భాస్కర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సురేష్, నీకే మాలిక్, ట్రెజరర్ మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.


జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్ : పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. 108 అంబులెన్స్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై జిల్లా రవాణా శాఖ అధికారి రఘునందన్ గౌడ్ ఆధ్వర్యంలో సూచనలు చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సాదుల శ్రీనివాస్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే సైరన్ వేయాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించి రక్షించడమే ప్రథమ కర్తవ్యంగా ఉండాలన్నారు.

తెలంగాణపై కేంద్రం చిన్నచూపు



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

రంగారెడ్డినగర్: రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూనే ఉందని, పద్మ అవార్డుల విషయంలో సైతం రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఐడీపీఎల్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ తన పాటలతో తెలంగాణ సమాజంలో ఉత్తేజాన్ని నింపారే తప్ప ఏనాడూ తుపాకీ పట్టలేదన్నారు. బీజేపీ భావాజాలం ఉన్న వారికే పద్మ అవార్డులు వరించాయన్నారు. గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా సీఎన్ రఘు ప్రసాద్



బాధ్యతలు స్వీకరించిన సీఎన్ రఘు ప్రసాద్

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ పదవీ కాలం ఈ నెల 26తో ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మంగళవారం నిజాంపేట్ నగర పాలక సంస్థ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన సీఎన్ రఘు ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ చింతల చెరువును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 329 ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను మరోసారి అధికారులు పెద్ద ఎత్తున కూల్చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో మంగళవారం మధ్యాహ్నం 8 గదులను కూల్చివేశారు. కూల్చి వేస్తున్న సమయంలో ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా సూరారం సీఐ భరత్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జూలైలో హైడ్రా అధికారులు ఇదే ప్రాంతంలో 40 పైగా గదులను కూల్చివేశారు. తాజాగా నిర్మించిన 8 గదులను నేలమట్టం చేశారు. తమ ఇళ్లను కూల్చివేయవద్దని కొంతమంది బతిమిలాడినా వారిని అడ్డుకొని నిర్మాణాలను తొలగించారు.

చెత్తను తొలగించరా?



పద్మా నగర్ ఫేజ్ 2 ప్రధాన రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం



రోడ్డు పక్కన వేసిన చెత్తా చెదారం

కుత్బుల్లాపూర్: పద్మా నగర్ ఫేజ్ 2 ప్రధాన రోడ్డు శ్మశాన వాటిక పక్కన ప్రధాన రోడ్డుపై చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుంది. ప్రతి రోజు ఉదయం చెత్తను తొలగించాల్సిన సిబ్బంది 10 గంటలు అయినా తొలగించకపోవడంతో రోడ్డుపై ఇలా చిందరవందరంగా కనిపించింది. సిబ్బంది సైతం రోడ్లు ఊడ్చి చెత్తను ఇక్కడే పడేసి వెళ్తున్నారని, ఈ చెత్తను తొలగించే సిబ్బందితో పాటు వాహనం ఒకరోజు వస్తూ మరో రోజు రాకపోవడం వల్ల చెత్త ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను ప్రతి రోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ కొంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మ గూడ ఎక్స్ రోడ్డు నుంచి బహదూర్ పల్లి వెళ్లే మార్గం ఇరువైపులా చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను సంచుల్లో తీసుకొచ్చి అక్కడ పడేసి పోతున్నారని, మున్సిపల్ అధికారులు తక్షణమే చెత్తను తొలగించి, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అయోధ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్‌లో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన కార్పొరేటర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, జాకీ, అంజయ్య, వీరేశం, సింహాద్రి, పాపయ్య, వనజ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పట్ట పగలూ వెలుగులే!



పగటిపూట వెలుగుతున్న స్ట్రీట్‌లైట్

జీడిమెట్ల: జీహెచ్ఎంసీ సిబ్బంది పగటిపూట వీధి దీపాలను ఆఫ్ చేయడం మరచిపోతున్నారు. సుభాష్‌నగర్‌లోని వెంకటాద్రినగర్‌లో ఆరు నెలలుగా పగలు, రాత్రి స్ట్రీట్‌లైట్స్ వెలుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై స్థానికులు జీహెచ్ఎంసీ సిబ్బందికి తెలిపిన వారు ఆఫ్ చేయడం లేదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పగటి పూట లైట్లు ఆఫ్ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.